క్లుప్తంగా

కలెక్టర్ లక్ష్మీశకు ఉద్యోగుల అభినందన



ఇబ్రహీంపట్నం: ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ జి.లక్ష్మీశను గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఉద్యోగులు సోమవారం కలెక్టర్ చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.జానీపాషా కలెక్టర్‌కు పూల మొక్క అందజేసి అభినందనలు తెలియజేశారు. సమాజహితం కోసం ఉద్యోగులు బాధ్యతగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యోగులు పనిచేసి ప్రజల మెప్పు పొందాలన్నారు. ఎంప్లాయిస్ ఫెడరేషన్ నేతలు ఎం.శశిధర్, ఎస్కే.మహబూబ్ సుభాని, జి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'మీ కోసం'లో అర్జీల స్వీకరణ

నూజివీడు: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీ కోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా ప్రజల వద్ద నుంచి కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్ అర్జీలను స్వీకరించారు. వీటిని పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు పంపారు. మీ కోసంలో మూడు అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరు భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరానీ, హెచ్‌ఓ ఆర్ హేమ, డీఎల్‌డీఓ వెంకటరత్నం, ఏడీఏ జీ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ట్రెక్కింగ్‌లో ప్రతిభ

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు జెడ్పీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి అమ్మిదేవరపు హర్షవర్ధన్ ఎన్‌సీసీ ట్రెక్కింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చాడు. మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఈనెల 8 నుంచి 15వ తేదీ వరకు జరిగిన 'శివాజీ ట్రైల్ ట్రెక్ 2024 ట్రెక్కింగ్‌లో పాల్గొని మంచి ప్రతిభ కనబరిచి ప్రశంసా పత్రం పొందడం పాఠశాలకు గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేవిడ్ రాక్ ఫెల్లర్ సోమవారం తెలిపారు. హర్షవర్ధన్‌ను స్ఫూర్తిగా తీసుకుని రాబోయే రోజుల్లో మన ప్రాంతం నుంచి మరింతమంది విద్యార్థులు ఎన్‌సీసీ ట్రెక్కింగ్‌కు వెళ్లేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి బి.ఆదిలక్ష్మి, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గంపలగూడెం: మండలంలోని తోటమూల కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేసి లోపాలను గుర్తించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రత్యేక అధికారి ఎం.వెంకటలక్ష్మి, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కే నాగేశ్వరరావు, బి.ప్రసాద్, శ్రీనివాస్, క్రాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా గతంలో నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులు అందజేశారు. ఆయా పోటీల్లో విజేత విద్యార్థులకు షీల్డ్, ప్రశంసాపత్రం, బహుమతులను అందజేశారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ ఎన్నిక

నూజివీడు: ఆర్యవైశ్య సంఘం నూజివీడు మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన చిన్నం శ్రీనివాసరావు, కార్యదర్శిగా మానేపల్లి సతీష్ కుమార్, కోశాధికారిగా తటవర్తి కుమార వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరి ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం పట్టణంలోని పీఏఎస్‌ఆర్ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్యవైశ్య సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొగ్గవరపు వెంకట రాజారావు మాట్లాడుతూ సంఘం తరపున సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలన్నారు. గౌరవాధ్యక్షుడు దోసపాటి రాము అధ్యక్షతన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను మోసగించిన ప్రభుత్వం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కూటమి ప్రభుత్వం ఇచ్చిన మోసపూరిత వాగ్దానాలతో ప్రజలు మోసపోయారని డీసీసీ అధ్యక్షుడు బొర్రా కిరణ్ అన్నారు. కొండపల్లిలో జిల్లా స్థాయి కాంగ్రెస్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కంటితుడుపు చర్యగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితం అంటూ రూ.2,400 జమచేస్తూ లబ్ధిదారులను మోసం చేశారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని దుయ్యబట్టారు. జిల్లా ఇన్‌చార్జ్ మొవ్వ మోహనరావు, వివిధ నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

తిరువూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం జాబ్ మేళా జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా ఉపాధి కల్పనా శాఖ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థల ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళాలో 10వ తరగతి, ఆపై ఉత్తీర్ణత కలిగిన అభ్యర్థులు హాజరు కావచ్చన్నారు. యాక్సిస్ బ్యాంకు, మెడ్ ప్లస్, సుధీర్ టింబర్ డిపో తదితర సంస్థల్లో అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, పూర్తి వివరాలకు 63015 34435, 95533 15667 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పత్తి రైతు దిగాలు

తగ్గిన దిగుబడులతో రైతుల ఆవేదన

- వర్షాలకు దెబ్బతిన్న పత్తి
- పురుగుల దాడి ఉధృతి
- పెట్టుబడులు వస్తాయో రావో అని రైతుల ఆందోళన
- ప్రభుత్వం మద్దతు ధర పెంచి ఆదుకోవాలని వినతి



తీతకు వచ్చిన పత్తి పంట



గులాబీ తెగులు సోకి దెబ్బతిన్న పత్తి కాయ

మైలవరం: దిగుబడి లేక పత్తి రైతులు దిగాలు చెందుతున్నారు. ఆటుపోట్లను అధిగమించి, వ్యయ ప్రయాసలకోర్చి పెట్టిన ఖర్చులు వస్తాయోరావో అని ఆవేదన చెందుతున్నారు. గత సీజన్‌లో ఎప్పుడూ పడని పాట్లను ఈ ఏడు చవిచూశామని రైతులు పేర్కొంటున్నారు.

నియోజకవర్గంలో 8,425 ఎకరాల్లో..

ఈ ఏడాది మైలవరం నియోజకవర్గంలోని మైలవరం మండలంలో 3,275 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా, రెడ్డిగూడెం మండలంలో 462 ఎకరాలు, జి.కొండూరు మండలంలో 4,000 ఎకరాలు, ఇబ్రహీంపట్నంలో 688 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు.

పత్తి తీతలు మొదలు..

ప్రస్తుతం పత్తి మొదటి కోత పనులు అక్కడక్కడా మొదలయ్యాయి. పత్తితీత పనులు ఊపందుకోవాలంటే ఇంకా వారం పదిరోజులు సమయం పడుతుంది. మరి కొన్ని చోట్ల పత్తికాయ ముదిరిన దశలో ఉంది. ఈ దశలో తీపి ఎక్కువగా ఉంటుంది. ఈకారణంగా పురుగులు ఎక్కువగా ఆశించడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

గత వర్షాల ప్రభావంతో..

అయితే ఈ ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలు, వరదలకు పత్తి చేలు 35 శాతం ముంపునకు గురయి, దెబ్బ తిన్నాయి. దీంతో పాటు గులాబీ తెగులు ఆశించడంతో పత్తి దిగుబడి బాగా తగ్గనున్నట్లు రైతులు చెబుతున్నారు. పత్తి మొక్కలు పెరగకపోవడం, గిడసబారటం, పురుగు ఆశించడం వలన దిగుబడి ఆశించిన విధంగా రాకపోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అదుపులోకి రాని పురుగు..

గులాబీ రంగు పురుగు నివారణకు పలు రకాలు క్రిమి సంహారక మందులు పిచికారీ చేసినా పురుగు అదుపులోకి రావడం లేదని రైతులు తెలిపారు. అన్ని కాయల్లో ఈ పురుగు ఉంటోంది. కాయపై భాగంలో నల్లటి మచ్చలు, తప్పితే పురుగు మాత్రం పైకి కన్పించడం లేదని, కాయ లోపలికి చొచ్చుకుపోయి పత్తి తొనలు తినేస్తుండటంతో పత్తి రంగు కూడా మారిపోతుందని రైతులు చెబుతున్నారు.

దిగుబడి తగ్గుతుందని భయం..

గతంలో ఎకరాకు ఏడు నుంచి ఎనిమిది క్వింటాళ్ల పత్తి రాగా ఈ ఏడాది ప్రతి కూల వాతావరణం ప్రభావంతో ఎకరానికి నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల కూడా రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. మైలవరంలో ఇప్పటికే పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పటికీ సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, రవాణా చార్జీలు భారంగా మారడంతో రైతులు గ్రామాల్లోనే దళారులకు అమ్ముకుని వచ్చిన కాడికి సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి..



నాకున్న రెండు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు పొలాలు దెబ్బ తిన్నాయి. ఎకరానికి రూ.50 వేలు పెట్టుబడి పెట్టాను. మొదటిసారి పంట పోవడంతో మళ్లీ రెండోసారి వేయగా అది కూడా దెబ్బ తింది. రైతులు కోలుకోవాలంటే పత్తికి గిట్టుబాటు ధర పెంచి రూ.8 వేలకు పైగా పెంచాలి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ప్రత్తిపాటి దాసు, రైతు, వెల్వడం

రూ.5,500 మించి కొనడం లేదు..



నాకున్న ఏడున్నర ఎకరాల్లో ఎకరంలో పత్తి, మిగిలింది మొక్కజొన్న పంటలు వేశా. పత్తికి ఇప్పటికే ఎకరానికి రూ.40 వేలు ఖర్చు చేయాల్సి వచ్చింది. వర్షాలు, వరదల వలన పత్తి మొక్కలు బాగా దెబ్బ తిన్నాయి. కాయలోకి పురుగులు చేరి నాశనం చేశాయి. ఎన్ని మందులు వాడినా ఫలితం లేదు. ఎకరాకు 6,7 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. క్వింటా రూ.5,500 మించి పలకడం లేదు, ఈ లెక్కన ఖర్చులు కూడా రావు.

– జోనబోయిన శ్రీనివాసరావు, బొర్రగూడెం

మద్దతు ధర క్వింటా రూ.8,000 పైగా ఇవ్వాలి..

ప్రస్తుతం పత్తి ధర క్వింటా రూ.5,500 పలుకుతుండగా కేంద్ర ప్రభుత్వం ఈ సీజన్‌లో పత్తి క్వింటా ధర రూ.7,521గా నిర్ణయించింది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం కారణంగా ఖర్చులు పెరిగిన నేపథ్యంలో కనీస మద్దతు ధర రూ.8000 పైబడి ఇస్తే ఖర్చులు దక్కుతాయని రైతులు చెబుతున్నారు.

అందరూ కలిసిమెలిసి ఉండాలి

మాజీ మంత్రి జోగి రమేష్



జి.కొండూరు(మైలవరం): కుల, మత, రాజకీయాలకతీతంగా కలిసి మెలిసి ఉండాలని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ సమన్వయకర్త జోగి రమేష్ అన్నారు. కార్తికమాసం సోమవారం సందర్భంగా వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వేములకొండ సాంబశివరావు, ఆయన తమ్ముళ్లు రామారావు, రాంబాబు ఆధ్వర్యంలో జి.కొండూరు చెన్నకేశవస్వామి ఆలయంలో భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని జోగి రమేష్ సోమవారం రాత్రి ప్రారంభించారు. ముందుగా చెన్నకేశవస్వామి ఆలయంలో జోగి రమేష్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు అన్నం వడ్డించారు. ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వేములకొండ తిరుపతిరావు, సర్పంచ్ మండల అరుణ, నేతలు పాల్గొన్నారు.

నేడు రాజ్యాంగ ఆమోద దినోత్సవం

మైలవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని భారత రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన సందర్భంగా ఈనెల 26న రెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో 75వ భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ మల్లాది ప్రసాదరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్, మాల మహానాడు, గిరిజన, బీసీ, ముస్లిం మైనారిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు, అంబేడ్కర్ వాదులు, అభిమానులు, మేధావులు, వివిధ సామాజిక, సాంస్కృతిక, రాజకీయ పార్టీల నాయకులు జయప్రదం చేయాల్సిందిగా కోరారు.

ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలి

మైలవరం: ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకోవాలని జి.కొండూరు తహసీల్దారు చాట్ల వెంకటేశ్వరరావు తెలిపారు. మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలం వెలగలేరు సొసైటీ పరిధిలో అన్ని పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల పరిధిలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమైనట్లు తహసీల్దారు తెలిపారు. దళారులకు అమ్మి మోసపోవదన్నారు. రైతులకు అందుబాటులో గోనే సంచులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు సేకరించిన ధాన్యాన్ని సోమవారం లారీలు, ట్రక్కులలో మిల్లులకు పంపామని ఎంఏవో రామ్‌కుమార్ తెలిపారు. రైతులకు 48గంటల లోపులో బ్యాంక్ ఖాతాలలో సొమ్ములు జమచేస్తుందన్నారు. రవాణా వాహనాలు, హమాలీలు సిద్ధంగా ఉన్నారని, అన్ని కొనుగోలు కేంద్రాల సెక్రటరీలు అందుబాటులో ఉంటారన్నారు. రైతు తాళ్ళూరి రాజాబాబు, వెలగలేరు పీఏసీఎస్ కార్యదర్శి స్వామి, పీపీసీ సిబ్బంది, వీఏఏ ప్రసాద్ పాల్గొన్నారు.

భోజన పథకం ఏజెన్సీలకు వేతనాలు చెల్లించాలి

చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న ఏజెన్సీలకు గౌరవ వేతనం వెంటనే చెల్లించాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం పుల్లారావు డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏజెన్సీలు, సహాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు గడిచినా గౌరవ వేతనం చెల్లించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నా తక్కువ గౌరవ వేతనం నిర్ణయించడం దారుణమని అన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఎం. విజయకుమారి, తేళ్లూరి అంజమ్మ, తాణంకి ఏసు, బాయమ్మ నాగేశు పాల్గొన్నారు.

జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా ర్యాలీ



ర్యాలీలో ఎంపీపీ మెర్సీవనజాక్షి, అధికారులు

విస్సన్నపేట: స్థానిక నూజివీడు రోడ్డులో ఎస్టీ కాలనీ రోడ్డులో జెండర్ రీసోర్స్ సెంటర్‌ను కేంద్రమంత్రి వర్చ్యువల్‌గా సోమవారం ప్రారంభించారు. అనంతరం జెండర్ రీసోర్స్ సెంటర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, ఎంపీడీఓ చేకు చిన్నరాట్నాలు, వెలుగు ఏసీ రాజశ్రీ, ఏపీఎం జమలయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: లింగ వివక్ష తగదని వెలుగు ఏపీఎం దయాలరాజశేఖర్ అన్నారు. లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా సోమవారం స్థానిక వెలుగు కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అకృత్యాలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రజల్లో చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో మహిళలు కీలక పాత్ర పోషించాలన్నారు. సీసీలు దివ్య, లక్ష్మి, హుస్సేన్ బి, మండల సమైక్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొన్నారు.

అన్యాయంగా తొలగించారు.. ఆదుకోండి

మైలవరం: మూడున్నరేళ్లుగా మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీగా పని చేస్తున్న తనపై రాజకీయ వివక్షతో స్థానిక టీడీపీ నాయకుల ప్రోద్బలంతో తన స్థానంలో వేరే వారిని నియమించారని ఉంద్రకొండ విజయ ఆవేదన వ్యక్తం చేశారు. జి.కొండూరు జెడ్పీ హైస్కూల్‌లో పని చేస్తున్న తన విధులు తనకు కేటాయించాలని కోరుతూ జి.కొండూరు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌కు సోమవారం వినతి పత్రం అందజేసింది. ఇదే పాఠశాలలో నైట్ వాచ్‌మన్ సుధాకర్ తనను అన్యాయంగా తొలగించారని ఎంపీడీఓకు వినతి పత్రం ఇచ్చాడు. బాధితులు మాట్లాడతూ ఎంత ప్రాధేయపడినా స్థానిక టీడీపీ నాయకులు పట్టించుకోలేదన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన తమను తొలగించడం వలన నరకయాతన పడుతున్నామని వాపోయారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

రేషన్ డీలర్ల భర్తీకి నోటిఫికేషన్

తిరువూరు: తిరువూరు రెవెన్యూ డివిజన్లో 22 చౌక ధరల దుకాణ డీలర్ల నియామకానికి అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆర్డీవో మాధురి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేయనున్న రేషన్ దుకాణాలలో గంపలగూడెం మండలం చినకొమెర (ఓసీ, ఓపెన్ కాంపిటీషన్), పెనుగొలను బీసీ కాలనీ (ఓసీ), పెనుగొలను ఎస్సీ కాలనీ (ఓసీ), ఊటుకూరు(ఈడబ్ల్యూఎస్), ఊటుకూరు (ఓసీ), ఏకొండూరు మండలం గొల్లమందల (ఈడబ్ల్యూఎస్), కొండూరు (ఓసీ), తిరువూరు మండలం కోకిలంపాడు (ఓసీ), తిరువూరు (బీసీ–సీ) లకు కేటాయించినట్లు తెలిపారు. గంపలగూడెం మండలంలోని కొణిజర్ల(బీసీ–ఏ), మేడూరు(ఓసీ), గోసవీడు(బీసీ–బీ), కనుమూరు(ఓసీ), రెడ్డిగూడెం మండలం ముచ్చినపల్లి (ఎస్సీ), రాఘవాపురం(ఎస్సీ), రాఘవాపురం(బీసీ–ఏ), తిరువూరు మండలంలోని తిరువూరు(ఓసీ), మల్లేల(ఎస్సీ), ముష్టికుంట్ల (ఓసీ), గానుగపాడు(ఎస్సీ), కాకర్ల (ఎస్సీ), విస్సన్నపేట (ఓసీ) లకు కేటాయించినట్లు తెలిపారు. ఓపెన్ కేటగిరీకి కేటాయించిన దుకాణాలకు ఏ సామాజికవర్గానికి చెందిన వారైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇంటర్మీడియెట్, 18– 40 సంవత్సరాల లోపు వయస్కులైన స్థానిక అభ్యర్థులు దరఖాస్తుకు అర్హులు. డిసెంబరు 5లోపు దరఖాస్తులను తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో ధ్రువపత్రాలు జతచేసి సమర్పించాలి. 10వ తేదీన తిరువూరు జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు రాతపరీక్ష నిర్వహిస్తారు. అత్యధిక మార్కులు సాధించిన ఐదుగురు అభ్యర్థులకు తుది ఎంపిక ఆర్డీవో కార్యాలయంలో 12న జరుగుతుంది. దరఖాస్తు చేసిన అభ్యర్థులందరూ రాతపరీక్షకు హాజరు కావచ్చు.

భార్యపై హత్యాయత్నం చేసిన భర్త

మేడూరు(గంపలగూడెం): భార్యపై అనుమానంతో భర్త హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలోని మేడూరులో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ ఎస్.శ్రీను తెలిపిన సమాచారం ప్రకారం.. మేడూరుకు చెందిన అరుణ్ జ్యోతిని, జి.కొండూరు మండలం వెలగలేరుకు చెందిన గొర్రె సురేష్‌బాబుకు ఆరు సంవత్సరాల క్రితం వివాహం చేశారు. వీరికి ఇరువురు సంతానం. కాగా భార్యపై అనుమానంతో సురేష్‌బాబు నిత్యం గొడవలు పడుతున్నాడు. భర్త వేధింపులు తాళలేక గత కొంతకాలంగా అరుణ్‌జ్యోతి మేడూరులో పుట్టింటి వద్ద ఉంటోంది. ఇరువురికీ బంధువులు సర్దిచెప్పగా వారం రోజులుగా సురేష్‌బాబు కూడా మేడూరు వచ్చి ఉంటున్నాడు. ఆమెపై ఉన్న అనుమానంతో ఆదివారం రాత్రి నిద్రిస్తున్న భార్యను సుత్తితో తలపై మోదాడు. అరుణ్ జ్యోతిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



నూజివీడులోని కోట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

ఆలయాలకు కార్తిక దీపాల శోభ

కార్తికమాసంలో చివరి సోమవారం సందర్భంగా తిరువూరు, మైలవరం, నూజివీడు, నియోజకవర్గాల్లోని శివాలయాల్లో విశేషపూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచే పరమేశ్వరుడికి పంచామృతాలు, క్షీరాభిషేకాలను నిర్వహించారు. కార్తిక దీపాలు వెలిగించి మహిళలు భక్తి భావాన్ని చాటుకున్నారు.

– తిరువూరు/నూజివీడు/ఆగిరిపల్లి/ముసునూరు/గంపలగూడెం





ఆగిరిపల్లిలో శివలింగాకారంలో దీపాలు ; గంపలగూడెం మండలం ఊటుకూరు రామాలయంలో.. ; ముసునూరు బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

జాతీయ పోటీలకు ఎంపిక

తిరువూరు: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు మార్షల్ ఆర్ట్స్‌లో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఏడో స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు బక్కా కావ్యశ్రీ పాదెమ్మ బంగారు పతకం సాధించగా, హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పదో తరగతికి చెందిన షేక్ నెహా అజ్మి ఈ పోటీలలో వెండి పతకాన్ని సాధించినట్లు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర తెలిపారు. విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు.

'వక్ఫ్‌బోర్డు సవరణపై పునరాలోచన చేయండి'

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): వక్ఫ్‌బోర్డు సవరణపై పునరాలోచన చేయాలని ముస్లిం పర్సనల్ లా బోర్డు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అల్తాఫ్ రజా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని కోరారు. కొండపల్లిలో సోమవారం మాట్లాడారు. వక్ఫ్‌బోర్డు పరిధిలో ఉన్న మా భూములు మాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వక్ఫ్‌బోర్డు సవరణ చేయడం కన్నా రద్దు చేస్తే వంశపారంపర్య ముతవల్లీలు అందరూ కోటీశ్వర్లు అవుతారని స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు ఏర్పాటుకు ముందు భూముల రికార్డులు అన్నీ మా తాతముత్తాల పేర్లతో ఉన్నట్లు గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లిలకు మేలు చేసిందని ప్రధాని మోడీ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పూర్వీకుల ఆస్తిగా వక్ఫ్ బోర్డుతో రక్షణ కల్పిస్తామని చెప్పిన అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 1962 గెజిట్‌లో చేర్చి అప్పటి వరకు కోటీశ్వరులు, నవాబులు, జమీందారులుగా ఉన్న ముస్లింలను ఫకీర్లుగా మార్చడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. దేశం కోసం ముస్లింల త్యాగాలకు చిహ్నంగా ఇండియా గేట్ నిలిచిందన్నారు. వక్ఫ్‌బోర్డు సవరణపై ప్రధాని పునరాలోచన చేస్తారనే ఆశాభావం ఆయన వ్యక్తం చేశారు.

బీసీ ఉద్యోగుల వన సమారాధన

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వన సమారాధన కార్యక్రమం జి.కొండూరు మామిడి తోటల్లో సోమవారం జరిగింది. ఈకార్యక్రమానికి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు ఏ.మల్లికార్జున్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి రూ.790 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. బీసీ ఉద్యోగులు వన సమారాధనతో ఐక్యత చాటడం అభినందనీయమన్నారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముప్పసాని రామకృష్ణ నేతృత్వంలో మల్లికార్జున్‌ను సత్కరించారు. ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆటపాటలతో ఆహ్లాదంగా గడిపారు. వన భోజనాలు చేశారు. యూనియన్ ప్రాంతీయ అధ్యక్షుడు నారాయణ రావు, కార్యదర్శి శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

54 పాడి గేదెలకు వైద్య పరీక్షలు

ముసునూరు: కృష్ణా మిల్క్ యూనియన్, పశు సంవర్ధక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ముసునూరులో పశు వైద్యశిబిరాన్ని శనగల వెంకటశివజ్యోతి సోమవారం ప్రారంభించారు. పశు సంవర్ధక శాఖ ఏడీ లింగయ్య, మండల పశువైద్యాధికారి వెంకట చైతన్య, యూనియన్ వైద్య బృందం 54 పాడి గేదెలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షుడు గాజుల ఏడుకొండలు, మేనేజర్ హరిబాబు, యూనియన్ డీడీ లింగం ప్రసాద్, యూనియన్ సూపర్ వైజర్లు, పాల ఉత్పత్తిదారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: పట్టణంలో నూతన విద్యుత్ లైను ఏర్పాటు చేసే పనుల నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ నూజివీడు ఈఈ ఏ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమతా నగర్, టౌన్ చర్చి, విజయవాడ రోడ్డు, రాజీవ్ సర్కిల్, నెహ్రూ పేట, వెంకటేశ్వర స్వామి కోవెల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.